


డీఎస్సీ పరీక్ష వాయిదా వేయాలని హనుమకొండలోని జిల్లా కేంద్ర గ్రంథాలయం ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న అభ్యర్థులు

# రోడ్డెక్కి నిరుద్యోగుల నిరసన

- పోస్టులను 25వేలకు పెంచాలని డిమాండ్
- హనుమకొండలో గ్రంథాలయం వద్ద బైఠాయించిన డీఎస్సీ అభ్యర్థులు

## 90రోజుల పాటు డీఎస్సీ వాయిదా వేయాలి

హనుమకొండ చౌరస్తా, జూలై 1 : నిరుద్యోగులు రోడ్డెక్కారు. డీఎస్సీ వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం హనుమకొండలోని జిల్లా కేంద్ర గ్రంథాలయం ఎదుట అభ్యర్థులు బైఠాయించి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. డీఎస్సీ పోస్టులు 25వేలకు పెంచాలని, పదోన్నతుల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ డీఎస్సీ అభ్యర్థులు రోడ్డెక్కారు. ఈ నెల 18నుంచి ప్రారంభం కానున్న డీఎస్సీ పరీక్షలను వాయిదా వేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీ ప్రకారం వెంటనే 25వేల పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించాలని, 90 రోజుల పాటు పరీక్ష వాయిదా వేయాలన్నారు.




భూపాలపల్లిలో గని మేనేజర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

# బొగ్గు బ్లాకులను ప్రైవేట్ పరం చేయొద్దు

## నల్లబ్యాడ్జీలతో టీబీజీకేఎస్ నాయకుల నిరసన

భూపాలపల్లి రూరల్, జూలై 1 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింగరేణి బొగ్గు బ్లాకులను ప్రైవేట్ పరం చేయడానికి చేస్తున్న కుట్రలకు నిరసనగా సోమవారం భూపాలపల్లి ఏరియాలోని బొగ్గు గనులపై టీబీజీకేఎస్ నాయకులు, కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం బొగ్గు గనుల మేనేజర్లకు వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా టీబీజీకేఎస్ నాయకులు మాట్లాడుతూ ప్రస్తుతం వేలం ప్రక్రియలో ఉన్న శ్రావణపల్లి ఓసీపీ గనితోపాటు కల్యాణిఖని 6 బొగ్గు బ్లాకులను సింగరేణి సంస్థకే కేటాయించేలా చూడాలని, బొగ్గు బ్లాకుల వేలం ప్రక్రియలో సింగరేణి సంస్థ పాల్గొనవద్దని విజ్ఞప్తి చేశారు. కొంతకాలంగా కొత్త బొగ్గు బ్లాకులను సింగరేణి సంస్థకు కేటాయించకపోవడంతో సంస్థ ఉనికికి ప్రమాదం ఏర్పడిందని, 41 వేల మంది ఉద్యోగుల భవిష్యత్ ఆందోళనకరంగా మారిందని తెలిపారు. సింగరేణి సంస్థకు బొగ్గు బ్లాకులను ప్రభుత్వం కేటాయించేలా ఒప్పించాలని మేనేజర్లను కోరారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు నల్లవెల్లి సదానందం, భూపాలపల్లి డివిజన్ ఉపాధ్యక్షుడు బడితల సమ్మయ్య, నాయకులు గౌరీపతిశర్మ, మల్లారెడ్డి, నరేశ్, మధు, రాంచందర్, రాజేందర్, సురేశ్, రవి పాల్గొన్నారు.

# సీఎం సారు.. స్పందించారు

## క్యాన్సర్ బాధిత చిన్నారికి ముఖ్యమంత్రి భరోసా.. తక్షణమే వైద్య సహాయం అందించాలని ఆదేశం

హనుమకొండ, జూలై1: 'సీఎం సర్.. ప్లీజ్ హెల్ప్ మీ' అని వేడుకున్న క్యాన్సర్ బారిన పడిన చిన్నారి ఆదిల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి అభయమిచ్చారు. శనివారం 'నమస్తే తెలంగాణ'లో 'విన్న పాలు వినలే' శీర్షికన అతడి విషయం వెలుగులోకి రావడంతో ముఖ్యమంత్రి స్పందించారు. తక్షణమే వైద్య సహాయం అందించాలని అధికారులను ఆదేశించడంతోపాటు మరింత సాయం అందిస్తామని అతడి కుటుంబసభ్యులకు భరోసా ఇచ్చారు. వివరాలిలా ఉన్నాయి. నగరానికి చెందిన మహ్మద్ ఆదిల్ అహ్మద్ క్యాన్సర్‌తో బాధ పడుతున్నాడు. శనివారం నగర పర్యటనకు సీఎం రేవంత్ రెడ్డి వస్తున్నట్లు తెలుసుకొన్న ఆదిల్ తండ్రి కుమారుడిని తీసుకొని హనుమకొండ కలెక్టరేట్‌కు వచ్చాడు. ప్లకార్డు పట్టుకొని ముఖ్యమంత్రికి తన పరిస్థితిని వివరిద్దామను కుంటే అక్కడున్న పోలీసులు అడ్డుకున్నారు. సమీక్ష అనంతరం సీఎం వెళ్లిపోయారు. ఈ విషయం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితం కాగా, ముఖ్యమంత్రి దృష్టికి వెళ్లింది. తక్షణమే ఆదిల్‌కు వైద్య సహాయం అందించాలని ఆదేశించారు. ఈమేరకు సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాస్ బాలుడి కుటుంబసభ్యులతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రస్తుతం చిన్నారి ఆరోగ్య పరిస్థితిపై వేముల శ్రీనివాస్ ఆరా తీశారు. నెల రోజుల క్రితం ఆదిల్ అహ్మద్ చికిత్స కోసం బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రికి రూ.లక్ష ఎల్వోసీ మంజూరు చేయగా సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మరింత సాయం అందిస్తామని ఆదిల్ కుటుంబసభ్యులకు భరోసా ఇచ్చారు.




నమస్తే తెలంగాణ దినపత్రికలో ఈ నెల 30న ప్రచురితమైన కథనం



## పింఛన్ కోసం పండుటాకుల పాట్లు..!

ఈ చిత్రంలో కర్ర సాయంతో అడుగులో అడుగు వేస్తూ వస్తున్న వృద్ధ దంపతులది శివనగర్. పేరు చెరుకు దశరథం-నర్సమ్మ. గతంలో ఇద్దరికీ (వృద్ధాప్య, వైకల్య) పింఛన్ వచ్చేదని కానీ కరోనా నుంచి నాలుగేళ్లుగా పింఛన్ రావడం లేదని, వెంటనే ఇప్పించాలని సోమవారం వరంగల్ కలెక్టరేట్‌లో ప్రజావాణిలో వేడుకున్నారు.

– ఖిలా వరంగల్, జూలై 1

కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్భాటంగా తలపట్టిన 'ప్రజావాణి' ప్రజలకు పరిష్కారం చూపడం లేదు. ఎంతో ఆశతో కొందరు హైదరాబాద్‌కు వెళ్లి మరీ గోడు వెల్లబోసుకున్నా కనీస స్పందన లేకపోవడంతో వారిలో ఆవేదన వ్యక్తమవుతోంది. కేవలం దరఖాస్తులు స్వీకరించడమే తప్ప వాటిపై దృష్టి పెట్టకపోవడంతో దిక్కూమొక్కూ లేకుండా పేరుకుపోతున్నాయి. వాటిలో ముఖ్యంగా కీలకమైన రెవెన్యూ శాఖకు సంబంధినవే ఎక్కువ పెండింగ్ ఉండడం అధికారుల పనితీరుకు అద్దం పడుతున్నది.

- వరంగల్, జూలై 1 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)



హైదరాబాద్‌లో సచివాలయం ముట్టడికి ప్రయత్నిస్తున్న మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురం గ్రామ రైతులు

# గోడు వినేదెవరు?

## ప్రజా'వాణి'పై రెవెన్యూది అంతులేని నిర్లక్ష్యం

- దిక్కూమొక్కూ లేక పరిష్కారానికి నోచుకోని దరఖాస్తులు
- హైదరాబాద్‌కు వెళ్లి మరీ అర్జీ పెట్టుకుంటున్న బాధితులు
- హనుమకొండ, వరంగల్ జిల్లాలో అధ్వానం
- ఒక్కటీ పరిష్కరించని యంత్రాంగం
- మహబూబాబాద్ జిల్లాలోనూ ఇదే తీరు

ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి నిర్వహస్తామని కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చింది. ప్రకటించినట్లుగానే హైదరాబాద్‌లో ప్రజావాణి పేరిట ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించే ప్రక్రియను మొదలుపెట్టారు. వారం రోజులు హడావుడి చేసి ఆ తర్వాత ఎంపిక చేసిన రోజుల్లోనే ప్రజావాణి నిర్వహిస్తున్నారు. అయితే సమస్యలు పరిష్కారమవుతాయనే ఆశతో హైదరాబాద్‌కు వెళ్తున్న ఎంతోమందికి ఎలాంటి భరోసా దొరకడం లేదు. దరఖాస్తు ఇచ్చి రావడమే గానీ తమ విజ్ఞప్తి గురించి మళ్లీ ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. హైదరాబాద్‌లో ఇచ్చిన దరఖాస్తులను ఆయా జిల్లాలకు పంపిస్తుండగా వాటి పరిష్కారం ఎలా ఉన్నదో నివేదికలు పంపాలని జిల్లా ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో దరఖాస్తులు ఇవ్వడమే గానీ ఆ తర్వాత ఏమీ జరగడం లేదు. ప్రజలు ఎక్కువగా ఇబ్బంది పడే రెవెన్యూ శాఖలోని సమస్యలపై ఇచ్చిన దరఖాస్తుల పరిస్థితి మరీ అధ్వానంగా ఉంటోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మంగళవారం, శుక్రవారం హైదరాబాద్‌లోని సీఎం ప్రజావాణి నిర్వహిస్తున్నది. మంత్రులు, ఉన్నతాధికారులు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఇక్కడ ఇచ్చిన ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల నుంచి రెవెన్యూ సమస్యలపై ఇచ్చిన దరఖాస్తులను అధికారులు పట్టించుకోవడం లేదు. రెండు జిల్లాల్లోనూ ఒక్కటంటే ఒక్క దరఖాస్తును పరిష్కరించలేదు. రెవెన్యూ శాఖకు సంబంధించి ఆయా జిల్లాల కలెక్టర్లు పూర్తిగా బాధ్యత వహిస్తారు. జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో ఉండే రెవెన్యూ శాఖ సమస్యలపై ఇచ్చిన దరఖాస్తులను కనీసం పట్టించుకోవడంలేదు. హనుమకొండ జిల్లాకు సంబంధించి హైదరాబాద్‌లోని ప్రజావాణిలో 379 దరఖాస్తులు అందాయి. వరంగల్ జిల్లాకు సంబంధించి 354 దరఖాస్తులను ఇచ్చారు. ఇలా హైదరాబాద్‌లో ఇచ్చిన దరఖాస్తులను ఆయా జిల్లాలకు పంపించారు. జిల్లాస్థాయిలో వీటిని వర్గీకరించి ఆయా ప్రభుత్వ శాఖలకు పంపించారు. హనుమకొండ, వరంగల్ జిల్లాల్లోని రెవెన్యూ శాఖ దరఖాస్తులలో ఒక్కటీ పరిష్కారం కాలేదు. ఈ రెండు జిల్లాల్లోని ఉన్నతాధికారులు, రెవెన్యూ అధికారులు దరఖాస్తులను కనీసం పరిశీలించడం లేదు. మహబూబాబాద్ జిల్లాలోనూ ఇదే పరిస్థితి ఉన్నది. రెవెన్యూ శాఖకు సంబంధించి ఈ జిల్లా నుంచి 235 దరఖాస్తులు ప్రజావాణిలో ఇచ్చారు. 19 దరఖాస్తులనే ఇప్పటివరకు పరిష్కరించారు. 216 దరఖాస్తుల పరిస్థితి ఏమిటనేది ఎవరికీ తెలియని పరిస్థితి ఉన్నది. ఎన్నో ఆశలతో తమ సమస్యలు పరిష్కారమవుతాయని రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో పెట్టిన ప్రజావాణిలో దరఖాస్తులు ఇచ్చినా ఫలితం లేకపోవడంపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

**హైదరాబాద్‌లో సీఎం ప్రజావాణిలో రెవెన్యూ శాఖ దరఖాస్తుల తీరు**

| జిల్లా | దరఖాస్తులు | పెండింగ్ |
|---|---|---|
| హనుమకొండ | 379 | 379 |
| వరంగల్ | 354 | 354 |
| మహబూబాబాద్ | 235 | 216 |

## భూములకు పట్టాలివ్వాలని సచివాలయం ముట్టడి

### హైదరాబాద్ సెక్రటేరియట్ ఎదుట రైతుల ధర్నా

కేసముద్రం, జూలై 1 : తమ భూములకు పట్టాలివ్వాలని కోరుతూ మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలోని నారాయణపురం గ్రామ రైతులు సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తాము అనేక సంవత్సరాల నుంచి వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నామన్నారు. వ్యవసాయ భూములను సర్వే చేసి ధరణిలో నమోదు చేసే క్రమంలో తండ్రి పేరు అడవి, రైతు పేరు అడవి అని ముద్రించడంతో కొత్త పాస్ పుస్తకాలు రాలేదని తెలిపారు. దీంతో రైతుబంధు, రైతు బీమా, రుణమాఫీ వంటి పథకాలు పొందక ఆర్థికంగా నష్టపోయామని వాపోయారు. అనేక మార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఆందోళన చేయగా 2022లో ఎంజాయిమెంట్ సర్వే నిర్వహించిందన్నారు. 2023వ సంవత్సరంలో మొత్తం 1827 ఎకరాలకు గాను 700 ఎకరాలకు సంబంధించిన 700 మంది రైతులకు పట్టాలు ఇచ్చారని తెలిపారు. మిగిలిన సుమారు 700 మంది రైతులకు 1127 ఎకరాలకు పట్టాలు ఇవ్వకపోవడంతో రైతుబంధు, రైతు బీమా, రుణమాఫీ రావడం లేదని అన్నారు. రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని భూములకు పట్టాలు ఇవ్వాలని కోరారు. ఆందోళన చేపడుతుండగా పోలీసులు వచ్చి తీసుకువెళ్లారని రైతులు తెలిపారు. రైతులు ధరావత్ రవి, జాటోత్ వెంకన్న, శంకర్, లచ్చు, రాజేశ్, భీమా, దేవ శ్రీను తదితరులు ఉన్నారు.

## ఎన్నిసార్లు తిరిగినా పట్టించుకోలేదని..

- ప్రజావాణిలో కిరోసిన్ పోసుకున్న మహిళ
- జనగామ కలెక్టరేట్‌లో ఘటన
- భూమిని కబ్జా చేశారని ఆరోపణ
- దవాఖానకు తరలించిన పోలీసులు



పిల్లలతో ప్రజావాణికి వచ్చి కిరోసిన్ పోసుకున్న జ్యోతి

జనగామ చౌరస్తా, జూలై 1: తన భూమిని కబ్జా చేశారని.. న్యాయం చేయాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోలేదు. దీంతో విసుగుచెందిన జ్యోతి అనే మహిళ తన ఇద్దరు పిల్లలతో సోమవారం జనగామ కలెక్టరేట్‌లో జరిగే ప్రజావాణికి వచ్చి అక్కడే కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించింది. అనుకోని ఘటనతో అక్కడున్న పోలీసులు అడ్డుకొని వెంటనే ఆమెను జిల్లా ప్రధాన దవాఖానకు తరలించగా, కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. తన తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన నర్మెట గ్రామ శివారులోని సర్వే నంబర్ 201/బీ/1, 201/బీ/2లోని రెండెకరాల వ్యవసాయ భూమిని అదే గ్రామానికి చెందిన జంగిటి అంజయ్య, మరికొందరు కలిసి కబ్జా చేశారు. ఆ భూమి వద్దకు వెళ్తే సదరు వ్యక్తులు చంపేస్తామని బెదిరిస్తున్నారు. ఈ విషయంలో అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంతో కలెక్టరేట్‌కు వచ్చి ఆత్మహత్యాయత్నం చేసింది. ప్రస్తుతం జ్యోతి దవాఖానలో చికిత్స పొందుతోంది. కలెక్టరేట్‌లో జరిగే ప్రజావాణి వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అర్బన్ సీఐ ఎల్ రఘుపతిరెడ్డి ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ఇంటి స్థలాం కబ్జా చేశారని..

### కుటుంబంతో సహా మానుకోట కలెక్టరేట్ వద్ద నిరసన

మహబూబాబాద్ రూరల్/ నెల్లికుదురు, జూలై 1 : తమ ఇంటి స్థలాన్ని కబ్జా చేశారని సోమవారం కలెక్టరేట్ ఎదుట నెల్లికుదురు మండలానికి చెందిన ఓ కుటుంబం ప్లకార్డులతో నిరసన చేపట్టింది. బాధితుడు చిరంజీవి మాట్లాడుతూ.. తమ పూర్వీకుల నుంచి వస్తున్న పొలం, ఇంటి స్థలాన్ని తమ బాబాయి నరేందర్ కబ్జా చేశారని అన్నారు. తమకు అన్యాయం జరిగిందని గ్రామంలో అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని, సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసి, కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టినట్లు తెలిపారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.



మహబూబాబాద్ కలెక్టరేట్ ఎదుట నిరసన చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు



## రైతుల్లేని భరోసా

ఖాళీ కుర్చీలతో చీటకోడూరు రైతు వేదిక

- అవగాహన సదస్సులో ఖాళీ కుర్చీల దర్శనం
- వ్యవసాయ పనులు ఉండడంతో సమావేశానికి రాని రైతులు

రైతులకు భరోసా కల్పించేందుకు నిర్వహించే కార్యక్రమంలో వారే లేకపోవడంతో తూతూమంత్రంగా ముగించారు. మండలంలోని చీటకోడూర్ రైతు వేదికలో సోమవారం అధికారులు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. అసలే వానకాలం. వ్యవసాయ పనుల్లో బిజీబిజీ. వర్షాలు కురవకపోవడం, ఉన్న బోరుబావుల నీటితో రైతులు పొలం పనులు చేసుకుంటున్న క్రమంలో ప్రభుత్వం రైతు భరోసా పథకంలో భాగంగా వారి సూచనలు, సలహాలు తీసుకోవడానికి సమావేశం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి కొద్ది మంది రైతులే హాజరవడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి.

- జనగామ రూరల్, జూలై1

## త్వరలో యంగ్‌వన్ దుస్తుల తయారీ

- కంపెనీ చైర్మన్ కిహాక్ సంగ్
- శాయంపేట టెక్స్‌టైల్ పార్క్‌లో నిర్మాణ పనుల పరిశీలన



హెలికాప్టర్‌లో పార్క్‌కు చేరుకున్న యంగ్‌వన్ కంపెనీ చైర్మన్ కిహాక్ సంగ్

గీసుగొండ, జూలై 1: వరంగల్ జిల్లా గీసుగొండ మండలం శాయంపేట టెక్స్‌టైల్ పార్క్‌లో దక్షిణ కొరియాకు చెందిన యంగ్‌వన్ వస్త్ర పరిశ్రమ నిర్మాణ పనులను సోమవారం ఆ పరిశ్రమ చైర్మన్ కిహాక్ సంగ్, ప్రెసిడెంట్ మీన్‌సుక్ లీ, వైస్ చైర్మన్ షాజహాన్ (బంగ్లాదేశ్) పరిశీలించారు. వారితో మరో ఐదుగురు ఆ పరిశ్రమ ప్రతినిధులు ఉన్నారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో నేరుగా టెక్స్‌టైల్ పార్క్‌కు చేరుకున్నారు. వారికి టీఎస్‌ఐఐసీ జోనల్ మేనేజర్ సంతోష్‌కుమార్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. వారు పరిశ్రమ నిర్మాణ పనులు, ట్రైనింగ్ సెంటర్‌లో కుట్టుశిక్షణ పొందుతున్న మహిళల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఇక్కడ తమ కంపెనీ ఏర్పాటుకు 297 ఎకరాలు కేటాయించిందని, అన్ని రకాల అనుమతులు రాగా, రూ.వెయ్యి కోట్ల పెట్టుబడితో స్థాపించామని తెలిపారు. నిర్మాణ పనులు త్వరలోనే పూర్తిచేసి దుస్తుల తయారీ ప్రారంభించనున్నట్లు చెప్పారు. తమ కంపెనీ స్పోర్ట్స్, డ్రెస్ మెటీరియల్స్, జర్కిన్స్, సూట్స్ తదితర దుస్తులు ఉత్పత్తి చేస్తుందని, ఇందులో 11వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయని, ఇప్పటికే 700 మందికి కంపెనీ కుట్టుశిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. హైదరాబాద్‌లో సోమవారం సాయంత్రం సీఎం రేవంత్‌రెడ్డితో జరిగే సమావేశంలో పూర్తి వివరాలను తెలియజేస్తామన్నారు.

# మిల్లర్లతో మిలాఖత్!

- సీఎంఆర్ ఇవ్వని మిల్లులకు అధికారుల ధాన్యం కేటాయింపు
- సంవత్సరాలు గడుస్తున్నా పట్టించుకోని పౌరసరఫరాల సంస్థ

మహబూబాబాద్, జూలై 1 (నమస్తే తెలంగాణ): 'కంచే చేను మేస్తే కాసేవారేరి' అన్న చందంగా మారింది జిల్లాలో పౌరసరఫరాల సంస్థ అధికారుల తీరు. ఏటా రైతులు సాగు చేసిన ధాన్యాన్ని పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో కొనుగోలు చేసి మిల్లర్లకు పంపిస్తారు. క్వింటాలు ధాన్యానికి మిల్లర్లు 68 కిలోల బియ్యాన్ని తిరిగి పౌరసరఫరాల సంస్థకు అప్పగించాలి. ఇందుకు మిల్లింగ్‌కు అయ్యే ఖర్చులు కూడా మిల్లర్లకు ప్రభుత్వం చెల్లిస్తుంది. ఏటా వానకాలం, యాసంగిలో సాగు చేసిన ధాన్యాన్ని మిల్లర్లకు పౌరసరఫరాల సంస్థ అధికారులు కేటాయిస్తారు. ఒక సీజన్‌లో ఇచ్చిన ధాన్యానికి సంబంధించిన (కస్టమ్ మిల్లింగ్ రైస్) సీఎంఆర్ ఇవ్వకుండా బకాయి ఉంటే, మరుసటి సీజన్‌లో వచ్చే ధాన్యాన్ని ఆ మిల్లుకు కేటాయించొద్దు. ఇది చూడాల్సిన పౌరసరఫరాల సంస్థ అధికారులు మిల్లర్ల బలహీనతను ఆసరాగా చేసుకున్నారు. మాకు డబ్బులు ఇస్తే సీఎంఆర్ బకాయి ఉన్నా ధాన్యం కేటాయిస్తామని అవినీతికి తెరలేపారు. లారీ లోడ్‌కు మామూళ్లు పుచ్చుకొని మిల్లర్లకు ధాన్యాన్ని కేటాయించారు. కేసముద్రంలో మూడు మిల్లులకు కేటాయించిన రూ.30 కోట్ల ధాన్యం సీఎంఆర్ పెట్టడం లేదని అధికారులు ఇప్పుడు గగ్గోలు పెడుతున్నారు. ఈ మిల్లులు గత మూడు సంవత్సరాలుగా బకాయి ఉంటే వసూలు చేయని అధికారులు ఇప్పుడు హడావుడిగా తనిఖీలు నిర్వహించి సీఎంఆర్ పెట్టడం లేదని ప్రకటనలు చేశారు. ఇదంతా అధికారులకు తెలిసినా ఇన్ని రోజులు ఎందుకు తెలియనట్టు నటించారనేది వెయ్యి డాలర్ల ప్రశ్న. ఇంకా జిల్లాలో చాలా మంది మిల్లర్లు సీఎంఆర్ ఇవ్వకున్నా అటువైపు అధికారులు కన్నెత్తి కూడా చూడడం లేదు. ఏటా జిల్లాలో వానకాలం, యాసంగిలో సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు కేటాయిస్తారు. వానకాలంలో వచ్చిన ధాన్యం రా రైస్, యాసంగిలో సాగు చేసిన ఎక్కువగా బాయిల్డ్ మిల్లులకు కేటాయిస్తారు. జిల్లాలో మొత్తం 33 మిల్లుల వరకు ఉన్నాయి. రెండు సంవత్సరాల నుంచి మిల్లర్లు సీంఎఆర్ ఇవ్వకున్నా అధికారులు ఎందుకు చోద్యం చూశారన్నది ప్రశ్నార్థకంగా మారింది. మిల్లర్లతో మిలాఖత్ అయి అధికారులు వారికి వంత పాడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒక మిల్లు యజమాని పాత సీఎంఆర్ ఇవ్వనప్పుడు అతడికి కొత్తగా ధాన్యం ఇవ్వకూడదనే నిబంధన ఉంది. ఒకవేళ జిల్లాలో మిల్లర్లు చాలామంది సీఎంఆర్ పెట్టకుండా ఉంటే, ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని ఇతర జిల్లాలోని మిల్లర్లకు ధాన్యాన్ని కేటాయించాలి. ఇక్కడ అధికారులు ఆ నిబంధనను కూడా తుంగలోతొక్కారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి మిల్లర్లతో మిలాఖత్ అయిన అధికారులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.